నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 7 ఆగస్టు 2024 | HYDERABAD

చింతల్‌కుంట చెరువులో వెలసిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి

అక్రమ నిర్మాణాలపై
హైడ్రా పంజా

గాజులరామారంలో ప్రభుత్వ భూములకు విముక్తి
చింతల్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్, ఆగస్టు 6 : గాజులరామారంలో హైడ్రా అధికారులు పంజా విసిరారు. ప్రభుత్వ భూములతో పాటు చెరువుల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను ఆక్రమించి నిర్మించిన పలు ఇండ్లను అధికారులు నేలమట్టం చేశారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కూల్చివేతలు కొనసాగాయి. హైడ్రా అధికారులు 52 నిర్మాణాలను మాత్రమే కూల్చివేసినట్లు చెప్పినప్పటికీ సుమారు 70కి పైగా ఇండ్లను నేలమట్టం చేసినట్లు తెలుస్తున్నది. చెరువులు, కుంటల్లోని బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా.. మొదటిసారి గాజులరామారం నుంచే చర్యలు ప్రారంభించింది. కుత్బుల్లాపూర్ (మండలం) నియోజకవర్గం పరిధి, గాజులరామారంలోని సర్వే నం.329/1 లోని చింతల్‌కుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు మంగళవారం వాటిని కూల్చివేశారు. చెరువుల పునరుద్ధరణతో పాటు, నీటి వనరుల పరిరక్షణ, పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గాజులరామారంలోని చింతల చెరువు బఫర్ జోన్‌తో సహా 44.3 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన చెరువు ఫుల్‌ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమంగా 52 నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికుల నుంచి అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల్లో ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య, డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాల్‌రెడ్డి సహకారంతో హైడ్రా విభాగం మార్షల్స్ డీ.ఆర్.ఎఫ్ బృందాలతో అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించారు.

పేదలకు అమ్మిన అక్రమార్కులపై చర్యలేవీ?

చింతల్‌కుంట చెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించి ఇండ్లు నిర్మించారనే కారణంతో మంగళవారం పలు ఇండ్లను హైడ్రా అధికారులు కూల్చివేశారు సరే. మరి బాధితుల గోడును ఎవరు పట్టించుకుంటారనేది మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారింది. ఇక్కడ ఇండ్లు కొనుగోలు చేసిన వారందరూ పేదలే.ఒక్కొక్క ఇంటికి 15లక్షలు చెల్లించి కొనుగోలు చేశారు. ఇప్పుడు వారిని ఆదుకునేది ఎవరు. ప్రభుత్వ భూములను పేదలకు అంటగట్టి కోట్లాది రూపాయలు సంపాదించుకున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుంటారా? పేదలు కోల్పోయిన డబ్బులను కబ్జాదారుల నుంచి రికవరీ చేసి బాధితులకు ఎవరు ఇస్తారు? వారి జీవితకాలం కష్టం అక్రమార్కులు మెక్కాల్సిందేనా.? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు స్థానికులు. పేదలను మోసగించిన అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీఓ ముందు ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో నో పార్కింగ్ ప్లేస్‌లో.. రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

వసతుల్లేవ..

అద్దె భవనంలో వెస్ట్‌జోన్ ఆర్టీఓ కార్యాలయం

వసతులు లేక వెస్ట్‌జోన్ టోలీచౌకి ఆర్టీవో కార్యాలయానికి వచ్చే వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ కార్యాలయానికి పార్కింగ్, మైదానం, సరైన వసతులు లేవు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారు రోడ్ల పైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ జాం అవుతున్నది. దీంతో నిత్యం ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనదారులకు, ఇటు కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా మైదానంతో కూడిన నూతన భవనం నిర్మించాలని అధికారులు, వాహనదారులు కోరుతున్నారు.

- సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ)

ప్రధాన రోడ్డుపైనే వాహనాల రిజిస్ట్రేషన్లు
ఇటీవల రెండు కొత్తకార్లకు ప్రమాదం
రోడ్లపైనే వాహనాల పార్కింగ్..
ఇదే అదునుగా ట్రాఫిక్ చలాన్ల విధింపు
మైదానం లేక తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

హైదరాబాద్ పరిధిలోని వెస్ట్‌జోన్ టోలిచౌకి ఆర్టీఓ కార్యాలయం దిన దినం యమగండంగా మారుతున్నది. ఓల్డ్ ముంబై హైవేను ఆనుకొని ఉన్న ఆర్టీఓ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో పాటు చీకటి గదులను తలపిస్తూ బూతు బంగ్లాలా దర్శనమిస్తోంది. వాహన సేవల కోసం వచ్చేవాళ్లంతా తమ వాహనాలను ప్రధాన రోడ్డు పైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నది. ఇదిలా ఉండగా ఈ కార్యాలయానికి మైదానం లేకపోవడంతో వాహనాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రతి రోజు సాహసోపేతమని చెప్పాలి. వాహనాల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వాహనదారులు తొలుత ఎడమ వైపున ఉన్న కార్యాలయం ఎదుట రోడ్డుపై వాహనాలను నిలిపి.. కార్యాలయంలో ఫొటో, డిజిటల్ సంతకం ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. అనంతరం కొంత దూరం ప్రయాణించి యూటర్న్ తీసుకుని మళ్లీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఓ చెట్టు కింద అంటే ప్రధాన రోడ్డు మార్గంపై వాహనాలను ఆపాలి. ఆ రోడ్డు గుండా ఇతర వాహనాలు వందల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన కార్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చి రోడ్డుపై నిలుపడంతో వెనుకాల నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా నియంత్రణ కాకపోవడంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగాయి. ఇటీవల రెండు కొత్త కార్లు ప్రమాదానికి గురయ్యాయని వాహనదారులు నమస్తే తెలంగాణతో చెప్పారు. ఏదైనా భారీ వాహనం వేగాన్ని నియంత్రించలేకపోతే రోడ్డుపై ఉన్న కొత్త వాహనాలు, వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న టోలిచౌకి కార్యాలయానికి ప్రభుత్వం మైదానంతో కూడిన భవనం నిర్మించాల్సిన అవసరం ఉన్నదని వాహనదారులు పేర్కొన్నారు. కనీస పార్కింగ్ సదుపాయం కూడా లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే ఆపాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇదే అదునుగా భావించి ట్రాఫిక్ పోలీసులు ఆగి ఉన్న వాహనాల ఫొటోలు తీసి చలాన్లు పంపిస్తున్నారని ప్రకాశ్ అనే వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు నిలుపడానికి టోలిచౌకిలో పార్కింగ్ స్థలం లేదని, ఎక్కడ వాహనాలను నిలుపాలని ప్రశ్నించారు. పై పెచ్చు కార్యాలయంలో ప్రమాదకరంగా విద్యుత్ లైన్లతో కూడిన పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉన్నదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి టోలిచౌకి కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించాలని కోరారు.

19 లక్షల ప్యాకేజీతో
9 మందికి ఉద్యోగాలు

జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 6 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికైన 9 మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.నర్సింహారెడ్డి అభినందించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 25 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయగా, నేడు 9 మంది విద్యార్థులకు అధికారికంగా నియామక పత్రాలను అందజేశారు. ఒక్కొక్క విద్యార్థికి 19 లక్షల సీటీసీతో 9 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించగా, మరొక విద్యార్థి వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. కాగా, మంగళవారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.నర్సింహారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విష్ణువర్ధన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ కళాశాలలో చదివిన విద్యార్థులకు ప్రతిభకు తగిన ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు.

నిమ్స్‌లో వన్‌వే..

పరిపాలనా విభాగం తాజా నిర్ణయం

బయటి వాహనాల ప్రవేశంతోనే సమస్య
ఇది ఫైనల్ కాదు.. ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నాం : డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, ఆగస్టు 6 : నిమ్స్ దవాఖానకు చికిత్స కోసం వెళ్లాలంటే వన్ వేలో ప్రయాణించాల్సిందేనా.. అంటే తాజాగా పరిపాలనా విభాగం తీసుకున్న నిర్ణయమే అందుకు నిదర్శనం. దవాఖానకు వచ్చే వారు పంజాగుట్ట రహదారి నుంచి ఎంట్రీ ఇచ్చి తిరుగు ప్రయాణంలో జలగం వెంగళరావు పార్కు ఎదురుగా బంజారాహిల్స్ రోడ్ నం.1లో ఉన్న గేటు ద్వారా బయటకు రావాలి. నిమ్స్‌కు ప్రతి నిత్యం వేలాదిగా రోగులు వివిధ చికిత్స కోసం వస్తుంటారు. తెలంగాణ నుంచే కాదు దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు పలు దేశాల నుంచి చికిత్స కోసం రోగులు వస్తారు. బయటి వాహనాలను నిరోధించేందుకేనని యాజమాన్యం చెబుతున్నా.. ప్రస్తుతం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దవాఖానకు వచ్చే రోగులు, వారి సహాయకులకే కాదు, సిబ్బందికి ఇబ్బందులు తప్పవంటున్నారు.

ఒక్కసారి ఎగ్జిట్ అయితే..

పంజాగుట్ట మీదుగా దవాఖానకు చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులు వైద్యులను సంప్రదించిన తర్వాత బంజారాహిల్స్ రోడ్ నం.1 వైపు ఉన్న ఎగ్జిట్ ద్వారా వెళ్లిపోవచ్చు. అయితే నిమ్స్ దవాఖానకు అధిక సంఖ్యలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారే వస్తుంటారు. అత్యవసర చికిత్సతో పాటు జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో (మెడికల్, సర్జికల్), పల్మనాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, హెమటాలజీ, ఆర్థోపెడిక్స్, రుమటాలజీ, ఆంకాలజీ (మెడికల్, సర్జికల్), వాస్కులర్, ప్లాస్టిక్ సర్జరీ, ఫిజియోథెరపీ తదితర విభాగాలు ఉన్నాయి. ప్రస్తుతం 1900 పడకల సామర్థ్యం కలిగిన నిమ్స్‌కు ప్రతి రోజు 2వేలకు పైగా వివిధ విభాగాలకు చికిత్స కోసం వస్తారు. అయితే ఒకే రోజు వచ్చి వైద్యులను సంప్రదించి వెంటనే తిరిగి వెళ్లే వారికి ఎలాంటి సమస్య ఉండదు. ప్రస్తుతం 2వేల పడకల సామర్థ్యం కలిగిన భవన నిర్మాణం నేపథ్యంలో నిమ్స్‌కు వెళ్లేందుకు ఈ రెండు దారులు మాత్రమే ఉన్నాయి. దీంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఇన్ పేషంట్‌గా ఉండాల్సిన వారు, వారికి ఆహారం, నీరు తీసుకువచ్చేందుకు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు సమస్య వస్తోంది. అంతేకాకుండా ప్రమాదాలు జరిగినప్పుడు అన్ని రకాల మందులు, కొన్ని వైద్య పరికరాలు నిమ్స్‌లో కాని, ఫార్మసీలో కాని దొరకకుంటే వారు అత్యవసరంగా ప్రైవేట్ మెడికల్ షాపులకు పరుగులు పెట్టాల్సి వస్తున్నది. నిత్యం ఇది జరుగుతూనే ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆ సందర్భంలో మందులు, లేక వైద్య పరికరాలను తీసుకొని వాహనాలపై మళ్లీ దవాఖానకు వెళ్లాలంటే వెంగళరావు పార్కు మీదుగా యూటర్న్ తీసుకొని పంజాగుట్టకు వెళ్లి అక్కడ మరో యూటర్న్ తీసుకొని ఖైరతాబాద్ వైపునకు వెళ్లి సివిల్ సప్లయి భవన్ సమీపంలో మరో యూటర్న్ తీసుకొని సుమారు కిలోమీటరు ప్రయాణించి పంజాగుట్ట ఎంట్రీ గేటుకు చేరుకోవాలి. లేదా తాజ్ కృష్ణ హోటల్ ఎదురుగా లెఫ్ట్ తీసుకొని అటు నుంచి పంజాగుట్ట వైపునకు వెళ్లే దారికి మరో లెఫ్ట్ తీసుకొని కనీసం కిలోమీటరున్నర ప్రయాణించి మొత్తం నిమ్స్ చుట్టూ ప్రదక్షిణ చేసి తిరిగి పంజాగుట్ట గేటు వద్ద ఎంట్రీ ఇవ్వాల్సి వస్తుందని పలువురు రోగులు, వారి సహాయకులు వాపోతున్నారు.

ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నాం..

ప్రతి రోజు నిమ్స్‌కు చికిత్సకు వచ్చే వారి వాహనాలే కాదు, ప్రైవేట్ వాహనాలు షార్ట్ కట్ రూట్ ద్వారా బంజారాహిల్స్ వెళ్లేందుకు అటు నుంచి పంజాగుట్ట వైపునకు వచ్చేందుకు నిమ్స్ క్యాంపస్‌ను వినియోగించుకుంటున్నారు. దీనిని అరికట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం తీసుకున్న వన్ వే నిర్ణయం ఫైనల్ కాదు. ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం నిమ్స్‌లో పార్కింగ్‌కు స్థలాభావ సమస్య ఉంది. అంతేకాకుండా బయటి వాహనాలను నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఒక వేళ రోగులు, వారి సహాయకులకు ఇబ్బందులు కలిగితే అవసరమైతే దీనిని విరమించుకుంటాం. అలాగే ఇటు నుంచి అటు వెళ్లేందుకు నిమ్స్ లోపలి మార్గాన్ని ఉపయోగించుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- డాక్టర్ నగరి బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

కరెంట్ స్తంభాలకు కేబుల్స్ తొలగింపు

నగరంలో నిలిచిపోతున్న టీవీ, ఇంటర్నెట్ ప్రసారాలు

పలు ప్రాంతాల్లో నగరవాసులకు తప్పని అసౌకర్యం

సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): కరెంట్ స్తంభాలకు వేలాడుతున్న ఇంటర్నెట్, కేబుల్ వైర్లను విద్యుత్ శాఖ అధికారులు తొలగిస్తున్నారు. విద్యుత్ శాఖ ఇటీవల చేపట్టిన 11కేవీ సర్వేతో విద్యుత్ స్తంభాలు కేబుల్స్ కారణంగా దెబ్బతింటున్నాయని దీంతో కరెంట్ సరఫరాకు అడ్డు తగులుతున్నట్లు గుర్తించారు. కొన్ని చోట్ల అగ్ని ప్రమాదాలు, కరెంట్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారుతుండటంతో వెంటనే కేబుల్, ఫైబర్ వైర్లను తొలగిస్తున్నారు. దీంతో మంగళవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కరెంట్ తీగలను తొలగిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటర్నెట్, టీవీ ప్రసారాలకు ఆటంకం..

తాజాగా నగరవ్యాప్తంగా చేపట్టిన కేబుల్, ఇంటర్నెట్ వైర్ల తొలగింపుతో పలు చోట్ల ఇంటర్నెట్, టీవీ ప్రసారాలు నిలిచిపోయాయి. నగరవాసులకు కొంత అసౌకర్యంగా ఉన్న నేపథ్యంలో కేబుల్ తొలగించే వరకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. అయితే కరెంట్ స్తంభాలకు వేలాడే ఫైబర్, ఇంటర్నెట్, కేబుల్ వైర్లలో 51శాతానికి పైగా నిరుపయోగంగానే ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే సంబంధిత శాఖలకు నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. ఆపరేటర్లకు ముందస్తు సమాచారంతోనే తొలగిస్తున్నామని విద్యుత్ అధికారులు స్పష్టం చేశారు. అనుమతి లేని కేబుళ్లను మాత్రమే తొలగిస్తున్నామని, అధిక బరువు కారణంగా కరెంట్ వైర్లు తెగిపడే ప్రమాదం ఉండటంతోనే తొలగిస్తున్నట్లుగా వెల్లడించారు.

రిటైర్డ్ అదనపు ఎస్పీకి టోకరా..

ట్రాప్ చేసి 14.7 కోట్లు వసూలు
రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులంటూ నమ్మించి మోసం
స్వగ్రామానికి వెళ్లొస్తామంటూ కనిపించకుండా పోయిన నిందితులు

సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్‌లో మంచి లాభాలొస్తాయంటూ నమ్మించి రిటైర్డు అదనపు ఎస్పీ నుంచి 15 నెలల్లో రూ.14.7 కోట్లు వసూలు చేసి ఒక కుటుంబం పరారైంది. బాధితుడు రిటైర్డు అదనపు ఎస్పీకి ఆ కుటుంబ సభ్యులందరు దగ్గరై నమ్మించి ఘరానా మోసానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసును హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. దీంతో తాజాగా సీసీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. కోకాపేట్‌లోని పౌలోమి అపార్టుమెంట్‌లో నివాసముండే జనార్దన్ రెడ్డి(81) రిటైర్డు అదనపు ఎస్పీ. కాగా 2023 ఫిబ్రవరిలో రాకేశ్ మాన్యం పరిచయమయ్యాడు. తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చాలా బాగుందని మంచి లాభాలొస్తాయంటూ మాయమాటలు చెప్పాడు. తన కుటుంబ సభ్యులు, స్నేహితులందరినీ పరిచయం చేసి.. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారంటూ నమ్మించాడు. ఇలా ఆయనతో కొన్నాళ్లు అందరూ స్నేహంగా ఉంటూ ఆ తరువాత రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టాలంటూ సూచించారు. వారిని పూర్తిగా నమ్మిన రిటైర్డ్ ఎస్పీ 2023 మార్చి నుంచి జూన్, 2024 మధ్యలో రూ.14.70 కోట్లు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల కోసం వారు అడిగినప్పుడల్లా డబ్బు ఇస్తూ వెళ్లాడు. జూలైలో తన సోదరి మృతి చెందిందని, తమ స్వగ్రామానికి వెళ్లి వస్తానంటూ రాకేశ్, అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులైన చంద్రకళ ఉప్పె, మాన్యం సందీప్, మాన్యం కమల్‌కుమార్, రాళ్లపల్లి వరలక్ష్మి, జి.నవ్య కిరణ్మయి తదితరులు అక్కడి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోను చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చాయి. ట్రాప్ చేసి రాకేశ్ ముఠా తన వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిందని గుర్తించిన బాధితుడు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరువాత కేసు నమోదు చేసి సీసీఎస్‌కు బదిలీ చేశారు.

ట్రేడింగ్ పేరుతో..

సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో 5 నుంచి 10 శాతం లాభాలు ఇప్పిస్తామంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఓ ప్రభుత్వ ఉద్యోగికి రూ.13 లక్షలు టోకరా వేశారు. వాట్సాప్‌లో స్టాక్ ట్రైనింగ్ కోసం 'ఏఓ02 ఆప్‌స్టాక్స్ సర్వీస్ గ్రూప్' పేరుతో ఒక గ్రూప్‌ను తయారు చేసి వివిధ స్టాక్‌మార్కెట్లలో ట్రేడింగ్‌పై అవగాహన కల్పిస్తానంటూ నమ్మించాడు. వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న వారు తమకు ఫలానా స్టాక్స్‌లో మంచి లాభాలొచ్చాయంటూ చర్చించుకుంటూ బాధితుడిని పరోక్షంగా ప్రేరేపించారు. ఈ క్రమంలోనే నకిలీ వెబ్‌సైట్ లింకును పంపించి అందులో షేర్స్ కొనాలంటూ సూచించాడు. మొదట లాభాలొస్తున్నాయంటూ నమ్మించి, ఆ తరువాత దఫాదఫాలుగా రూ. 13.7లక్షలు డిపాజిట్లు చేయించాడు. వెబ్‌సైట్‌లో లాభాలు స్క్రీన్‌పై కన్పించినా, వాటిని డ్రా చేసుకునే వీలు లేకపోవడంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హెచ్ఎండీఏ భూములకు రక్షణ

మియాపూర్ ఆక్రమణల ఎఫెక్ట్
తేరుకున్న హెచ్ఎండీఏ అధికారులు
ఖాళీ భూముల చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటుకు సన్నాహాలు
జీఐఎస్ సర్వే తర్వాత మిగిలిన భూములకు..

సిటీబ్యూరో, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ) : మెరుపు వేగంతో విలువైన భూముల్లోకి చొరబడితే గానీ అధికారులు తేరుకునేలా లేరు. వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతుందనే విమర్శలతో హెచ్ఎండీఏ అధికారులు కదిలారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న భూములను జీఐఎస్ సర్వేతోపాటు, హద్దు రాళ్లు, ముళ్ల కంచెను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా మియాపూర్‌లోని సర్వే నం. 20, 28లో ఉండే భూముల చుట్టూ భారీ ముళ్ల కంచెను ఏర్పాటు చేయనున్నారు. మియాపూర్‌లో సర్వే నం.100,101 పరిధిలో 500 ఎకరాల పరిధిలో ఉన్న హెచ్ఎండీఏ భూములను ఆక్రమించుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో భూములను పరిరక్షించడంలో హెచ్ఎండీఏ విఫలమైందనీ విమర్శలు వచ్చాయి. అయితే ఇప్పటికీ పలు చోట్ల భూములు కబ్జాలకు గురవుతుండగా.. స్థానికుల ఫిర్యాదులతో ఆక్రమణలను నిలువరించేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మియాపూర్ సమీపంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూములకు ముళ్ల కంచెను ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ విభాగం దృష్టి సారించింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టగా.. వచ్చే రెండు నెలల వ్యవధిలో పనులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

జీఐఎస్ సర్వేతో భూములకు రక్షణ ..

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న విలువైన భూములు, తాజా పరిస్థితిపై నివేదికలు రూపొందిస్తున్న అధికారులు తాజాగా భూముల స్థితిగతులను అంచనా వేసేందుకు జీఐఎస్ సర్వే నిర్వహించనున్నారు. దీని ద్వారా ఆయా భూములకు హద్దు రాళ్లను ఏర్పాటు చేయడంతోపాటు, దశల వారీగా కంచె నిర్మాణం చేపట్టనున్నారు.

మియాపూర్‌లో ఇటీవల స్థానికులు ఆందోళన చేసిన ఈ భూమికే కంచె ఏర్పాటు చేయనున్న అధికారులు

యువతులపై లైంగికదాడి

రెండు ఘటనలపై బేగంపేట్ పీఎస్ పరిధిలో కేసు నమోదు

బేగంపేట్, ఆగస్టు 6: వేర్వేరు ఘటనల్లో యువతులు లైంగికదాడికి గురయ్యారు. బేగంపేట్ పీఎస్ పరిధిలో మంగళవారం ఇద్దరు యువతులు తమపై జరిగిన లైంగికదాడి పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్న రాజ్‌కుమార్ (28) ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువతితో పరిచయం పెంచుకున్నాడు. ఆ యువతిని ప్రేమిస్తున్నానని నమ్మబలికి, జూన్ 24న బేగంపేట్‌లోని ఓ హోటల్‌కు తీసుకువచ్చి రాజ్‌కుమార్ లైంగికదాడి చేశాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన యువతికి ఫోన్ చేసి మరోసారి హోటల్‌కు రావాలని బెదిరించాడు. యువతి నిరాకరించడంతో రాజ్‌కుమార్ దుర్భాషలాడాడు. దీంతో మానసిక వేదనకు గురైన బాధితురాలు ఈ నెల 4న దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బేగంపేట్ పీఎస్‌కు బదిలీ చేశారు.

మరో ఘటనలో..

యువతిపై లైంగికదాడి చేసి కులం పేరుతో దూషించిన వ్యక్తిపై బేగంపేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువతి (29)కి వరంగల్ జిల్లా గుండ్ల సింగారానికి చెందిన కందుకూరి ప్రశాంత్ పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇద్దరి మధ్య పరిచయం పెరగడంతో తన ఉద్యోగం, బైక్ కొనుగోలు, అవసరాల నిమిత్తం డబ్బులు కావాలంటూ బాధితురాలి నుంచి డబ్బులు వసూలు చేశాడు. పెద్ద మొత్తంలో ఉన్న ప్రశాంత్ అప్పులను తీర్చేందుకు పలు సార్లు రూ. 14.60 లక్షల వరకు బాధితురాలు ఇచ్చింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌లోని ఓ గదికి తీసుకువచ్చి లైంగికదాడి చేశాడు. ఆ తరువాత పెళ్లి చేసుకోవాలని అడిగితే బాధితురాలిపై దాడి చేసి, కులం పేరుతో దూషించాడు. పెళ్లి విషయం దాట వేస్తూ, తప్పించుకుని తిరుగుతుండటంతో బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.